# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-07-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పదేళ్లుగా దేశ ప్రజల పట్ల సేవా భావంతో కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**
2. **రాజధాని అమరావతి కార్యాచరణ ప్రణాళికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శ్వేతపత్రం విడుదల చేస్తారు.**
3. **పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు సాగు, తాగునీటిని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ రోజు విడుదల చేశారు.**
4. **రాష్ట్రంలో పలు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించడంతోపాటు పలువురు ఐఏఎస్ అధికారులను రాష్ట్రప్రభుత్వం బదిలీ చేసింది.**
5. **అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు కొనసాగుతున్నాయి. ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో దేశ ప్రజలు విలక్షణ మైన తీర్పు ఇచ్చారన్నారు. దేశానికి సేవ చేసేవారినే ప్రజలు ఆశీర్వదించారని, ఎన్డీయే పాలనను దేశ ప్రజలు మరోసారి కోరుకున్నారని తెలిపారు. పదేళ్లుగా ప్రజల పట్ల సేవా భావంతో కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని పేర్కొంటూ,

వాయిస్ (25సెకన్లు)

-------------------------

కాలానుగుణ వ్యాధుల నియంత్రణ, ఖరీఫ్ సాగులో తీసుకుకోవాల్సిన చర్యలపై వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయా శాఖలకు సంబంధించిన మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. సమీక్ష అనంతరం రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి సంబంధించిన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై శ్వేతపత్రం విడుదల చేయనున్నారని అధికారులు తెలిపారు. కాగా ఈ రోజు సాయంత్రం ముఖ్యమంత్రి ఢిల్లీ బయలుదేరి వెళతారని, రాష్ట్ర అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు, పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారని అధికారులు తెలిపారు

-------------------------

నదుల అనుసంధానం ద్వారా నీటి లభ్యతను పెంచవచ్చని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఏలూరు జిల్లా పోలవరం వద్ద పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను మంత్రి ఈ రోజు విడుదల చేశారు. అనంతరం పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టుతో నదుల అనుసంధానం చేపడతామని అన్నారు.అధికారుల సమన్వయంతో నీటి నిర్వహణ సమర్థంగా చేపడుతున్నామని చెప్పారు. కృష్ణా డెల్టాకు ఎత్తిపోతల పథకం ద్వారా 8,500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తామని అదేవిధంగా ఈ నీటి విడుదల వల్ల కృష్ణా డెల్టాలో 13.08 లక్షలు ఎకరాలకు సాగు నీరు అందుతుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో పలు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించడంతోపాటు పలువురు ఐఏఎస్ అధికారులను రాష్ట్రప్రభుత్వం బదిలీ చేసింది. వీరిలో వైయస్సార్ జిల్లా కలెక్టర్‌గా శివశంకర్, విశాఖపట్నం కలెక్టర్‌గా హరేంద్ర ప్రసాద్, పల్నాడు జిల్లా కలెక్టర్‌గా అరుణ్ బాబులను నియమించారు.అలాగే అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్, సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా టి.ఎస్.చేతన్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు కలెక్టర్‌గా ఆనంద్, బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా రావిరాల మహేష్ కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్‌గా వెంకటేశ్వర్, పార్వతీపురం కలెక్టర్‌గా శ్యామ్ ప్రసాద్, అనకాపల్లి కలెక్టర్‌గా కె. విజయ, నంద్యాల కలెక్టర్‌గా రాజకుమారి, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్‌లను బదిలీ చేస్తూ ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

రాష్ట్రంలో నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ పాఠ్యాంశాలలో మార్పులు చేసినట్లు సామాజిక మాధ్యమాలలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. గతంలో ఉన్న అంశాలే ఇప్పుడూ ఉంటాయని పాఠశాల విద్యా శాఖకమిషనర్ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్, పరీక్షల షెడ్యూల్, పాఠ్యాంశాల తదితర వివరాలను ఇప్పటికే కమిషనరేట్ వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు నిర్ణయించిన సిలబస్నే ప్రస్తుత టెట్ పరీక్షకు కూడా నిర్ధారించినట్టు వివరించారు. ఈ సిలబస్ ఆధారంగానే అభ్యర్థులు పరీక్షకు సన్నద్ధం కావాలని సురేష్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గాన్ని అన్ని శాఖల సహకారంతో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ధర్మవరంలోని నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టవలసిన కార్యచరణ ప్రణాళికలపై సంబంధిత, అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నియోజకవర్గంలో పూర్తిగా నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మవరంలో చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు నిధులు మంజూరు చేయడానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలకు అవసరమైన రీతిలో సులభంగా అందించేందుకు చర్యలు

తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో నిన్న రిజిస్ట్రేషన్ల శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్ల శాఖను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా భూములు, స్థలాల రిజిస్ట్రేషన్ల కోసం సులభతరమైన సేవలు అందించాలని మంత్రి తెలిపారు.

---------------------------

జాతీయ ప్రతిభా ఉపకారవేతన పథకం ఎన్ఎంఎంఎస్ఎస్ ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకారం వేతనాలని పొందేందుకు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని కేంద్ర విద్యా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నూతన దరఖాస్తులు, ఉపకార వేతన పునరుద్ధరణ కోసం నేషనల్ స్కాలర్షిప్ వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామని పేర్కొంది. ఉపకారం వేతన పథకానికి నమోదు చేసుకునేందుకు ఆగస్టు 31 చివరి తేదీ అని, పేర్లు నమోదు చేసుకునేందుకు ఆధార్ సంఖ్య తప్పనిసరి అని తెలిపింది. నమోదు చేసుకునే సమయంలో వచ్చే 14 అంకెల ఓటిపి ద్వారా నేషనల్ స్కాలర్షిప్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయవచ్చని కేంద్ర విద్యా శాఖ ప్రకటనలో పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులకు త్వరలో శిక్షణ ఇవ్వనున్నట్లు శాసనసభాపతి అయ్యన్న పాత్రుడు తెలిపారు. నిన్న విజయనగరంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, శాసనసభలో అనుసరించవలసిన విధివిధానాలపై మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అవగాహన కల్పిస్తారన్నారు. ప్రజా సమస్యలపై చర్చించడానికి శాసనసభ సమావేశాలను మూడు, నాలుగు రోజులపాటు పొడిగిస్తామని వెల్లడించారు.

---------------------------

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ సంచుల వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని... వాటి స్థానంలో కాగితం, వస్త్రంతో చేసిన సంచులను ఉపయోగించాలని అవగాహన కల్పిస్తూ ప్రపంచ వ్యాప్తంగా జూలై 3వ తేదీన ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. భూమిపైన, సముద్రంలోనూ ప్లాస్టిక్ సంచులు ప్రకృతికి హాని కలిగిస్తాయని, అవి భూమిలో కలిసి పోయేందుకు వంద నుండి 500 సంవత్సరాలు పడుతుందని తెలియజేస్తూ.. అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జంతువులు ముఖ్యంగా పశువులు, పక్షులు, జలచరాలు ప్లాస్టిక్ సంచుల కారణంగా తీవ్రంగా నష్టపోయి, మృత్యువాత పడుతున్న నేపథ్యంలో ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని పూర్తిగా మానివేయాల్సిన ఆవశ్యకత ఉంది. కాగా అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి కాలుష్యం, దోమల వ్యాప్తి ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించడానికి పంచాయతీల ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కె.కన్నబాబు అధికారులను ఆదేశించారు. పంచాయతీల వారీగా ప్రజారోగ్య పరిస్థితులపై రోజు వారీ సమీక్ష నిర్వహించాలని, గ్రామాల్లో అంటు వ్యాధులు సోకిన కుటుంబాల వివరాలను ఆరోగ్య కార్యకర్తల ద్వారా సేకరించాలని సూచించారు. తీవ్ర జ్వరాలు, ఇతర కాలానుగుణ వ్యాధులు ప్రబలితే

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

తిరుమలకు వెళ్లే అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి- జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. నిన్న తిరుపతిలో అటవీ, భద్రతా విభాగాల అధికారులతో కాలిబాట భక్తుల భద్రతా చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిరుతలు, ఇతర జంతువుల సంచారం తెలుసుకొనేందుకు మరిన్ని ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా జంతువులు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో కంట్రోల్ రూంకు తెలిసేలా సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరిచాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

విజయవాడ డివిజన్‌లో సాంకేతిక పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖపట్నం-కడప మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు వారం రోజుల పాటు రద్దు చేసినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు ఎ.జనార్ధన్ తెలిపారు. అలాగే పెద్ద ఆవుటపల్లి, గన్నవరం మధ్య ట్రాఫిక్ నిర్వ హణ పనుల దృష్ట్యా మూడు ఎక్స్ ప్రెస్ రైళ్లను రేపటి నుంచి విజయవాడ, గుడివాడ, నిడద వోలు మీదుగా దారి మళ్లిస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం- కొల్లాం, ధన్ బాద్- తాంబరం, బరౌని-మంగళూరు రైళ్లను దారి మళ్లిస్తు న్నట్లు చెప్పారు.ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

======================